సాక్షి
చిత్తూరు
మంగళవారం । 21 । నవంబర్ । 2023



మెరుగు'బడి'
నాడు-నేడు పథకం కింద సర్కారు బడులను అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రజలు ప్రశంసిస్తున్నారు. - 8లో



కనువిందుగా 'కొండ'
గుడుపల్లె మండలం బూరుగుమాకులపల్లెలోని మల్లప్ప కొండ కనువిందు చేస్తోంది. - 8లో



పక్కాగా ప్రణాళికా బడ్జెట్
సమగ్ర శిక్ష ప్రణాళికా బడ్జెట్‌ను పక్కాగా రూపొందించాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. - 8లో

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గానికి మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విచ్చేయనున్నారు. ఈ మేరకు అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. సభా ప్రాంగణాన్ని చూడముచ్చటగా తీర్చిదిద్దారు. వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా పార్కింగ్ సౌకర్యం కల్పించారు. భద్రతా చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

- నేడు సూళ్లూరుపేట నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్
- పటిష్ట ఏర్పాట్లు చేపట్టిన అధికార యంత్రాంగం
- మత్స్యకారుల స్వప్నం సాకారానికి సమయం ఆసన్నం



తడ మండలం మాంబట్టు సెజ్ వద్ద సిద్ధమైన సభాప్రాంగణం

సూళ్లూరుపేట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఆయన సూళ్లూరుపేట నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నారు. పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈ మేరకు అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. తడ మండలం, మాంబట్టు వద్ద హెలీప్యాడ్, అక్కడి నుంచి కిలోమీటరు దూరంలో ఏపీఐఐసీ వారి స్థలంలో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా పులికాట్ ముఖద్వారాల పూడికతీత పనులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే కాళంగినదిపై నాలుగులేన్ల వంతెన నిర్మాణానికి, సూళ్లూరుపేట, తడ మండలాలకు ఉప్పునీటి బాధను తప్పించేందుకు కాళంగి గ్రాయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. తర్వాత కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి మాంబట్టు సెజ్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ట్రయల్ రన్ నిర్వహించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మరోవైపు జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి పోలీసులను దించారు.



మాంబట్టులో హెలికాప్టర్ ట్రయల్‌రన్





ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య

ముఖ్యమంత్రి జగన్ పర్యటన ఇలా..

- మంగళవారం ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 9 గంటలకు విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు.
- 9.45 గంటలకు గన్నవరం నుంచి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 10.20 గంటలకు మాంబట్టు సెజ్‌కు..
- 10.30కు హెలీప్యాడ్ వద్ద ప్రత్యేక బస్సు ఎక్కి మాంబట్టు సెజ్ రోడ్డు మీదుగా సభాప్రాంగణానికి చేరుకుంటారు.
- 10.45 నుంచి 10.55 దాకా ఎగ్జిబిషన్, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.
- 11.15 నుంచి 11.30 మత్స్యకారులతో ఇంటరాక్షన్
- 11.30 నుంచి 12.15 దాకా ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు
- 12.15 నుంచి 12.25 దాకా ఓట్ ఆఫ్ థాంక్స్ చెబుతారు
- 12.30 గంటలకు సభాప్రాంగణం నుంచి బయలుదేరి 12.40 హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.40 నుంచి 1.40 దాకా స్థానిక నాయకులతో ఇంటరాక్షన్
- 1.45 గంటలకు మాంబట్టు సెజ్ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 2.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 2.15 గంటలకు రేణిగుంట నుంచి విమానంలో బయలుదేరి 3 గంటలకు విజయవాడలోని గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.

న్యూస్‌రీల్

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు నాశనం చేసిన పైరు చూపుతున్న రైతు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని అయ్యావాండ్లపల్లె పంచాయతీ బెస్తపల్లెలో ప్రభాకర్ అనే రైతుకు చెందిన వరి పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. సోమవారం ఉదయం పొలంలో ప్రవేశించిన ఏనుగులు పైరును తొక్కి నాశనం చేశాయి. నాలుగు రోజులుగా పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో పంటలు ఏనుగులు దాడిలో దెబ్బతింటున్నాయని, సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వి.కోట: మండలంలోని నాగిరెడ్డిపల్లెలో ఆదివారం రాత్రి బోయకొండప్ప అనే రైతుకు చెందిన వరి పైరును ఏనుగుల గుంపు తొక్కి నాశనం చేసింది. కోత దశలో ఉన్న పంట ధ్వంసమైనట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు

మాతాశిశు సంరక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్ : మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. సోమవారం చిత్తూరులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి పీహెచ్‌సీ వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ తల్లీబిడ్డ ఆరోగ్య సేవలపై గ్రామీణులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో వివరించాలని కోరారు. మాతృత వందన యోజన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీపీఎంఓ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

సలహాల మేరకే పంటల సాగు

యాదమరి: వ్యవసాయశాఖ అధికారుల సలహాల మేరకు పంటలు సాగు చేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వనరులకేంద్రం వ్యవసాయశాఖ అధికారి పద్మజ తెలిపారు. సోమవారం మండలంలోని కాశిరాళ్ల గ్రామ రైతు భరోసా కేంద్రం పరిధిలో సాగులో ఉన్న కంది, వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారుల సూచనల ప్రకారం రైతులు ముందుగా భూసార పరీక్షలు చేయించుకుని, అందుకు పంటల సాగు చేపట్టి, ఎరువులు వాడుకోవాలని సూచించారు. చీడపీడలు ఆశిస్తే వెంటనే వ్యవసాయశాఖ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. వారు తెలిపిన ప్రకారం పురుగు మందులు వాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ చరిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఐరాల విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐరాల: రాష్ట్రస్థాయి అండర్-17 ఫెన్సింగ్ పోటీల్లో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరచినట్లు ప్రధానోపాధ్యాయని కోమల తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో ఎస్పీజీ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు రమ్య, గిరీష్, రెడ్డిప్రసాద్ కాంస్య పతకాలు సాధించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పాటు కోచ్ కార్తీక్, పీడీ దేవా అభినందించారు. పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



సమస్య తెలుసుకుంటున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. పలు వినతులను క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడే పరిష్కరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రజలు అందించే అర్జీలను అధికారులు బాధ్యతతో నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ సమస్యలపై మొత్తం 294 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

జీఎస్టీ లైసెన్స్ జారీలో మార్పులు

చిత్తూరు కార్పొరేషన్: జీఎస్టీ లైసెన్సు జారీ చేసే విధానంలో జీఎస్టీ కౌన్సిల్ స్వల్ప మార్పులు చేసినట్లు వాణిజ్య పన్నులశాఖ జేసీ జాన్‌స్టీవెన్సన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ లైసెన్సు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సైట్‌లోని రిస్క్ పారామీటర్ల ఆధారంగా డీలర్లకు మేసేజ్, మెయిల్ ద్వారా సమాచారం వస్తుందని వెల్లడించారు. అనంతరం డీలర్లు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో వాణిజ్యపన్నులశాఖ కార్యాలయంలోని జీఎస్టీ సేవా కేంద్రంలో బయోమెట్రిక్ నమోదు చేయించాలని వివరించారు.

వ్యవసాయానికి భరోసా

- అన్నదాతకు అండగా ప్రభుత్వం
- ఆర్‌బీకే ప్రారంభోత్సవంలో మంత్రి రోజా



రైతు భరోసా కేంద్రం భవన ప్రారంభోత్సవంలో మంత్రి రోజా



తాగునీటి పైపులైను పనుల భూమి పూజలో మంత్రి రోజా

పుత్తూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయానికి పూర్తి సహకారం అందిస్తున్నాయని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. సోమవారం మండలంలోని పరమేశ్వర మంగళంలో రూ.21.80 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అలాగే ఆర్‌బీకేలోని కియోస్క్ మిషన్, వ్యవసాయ లైబ్రరీని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ అన్నదాతకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆర్బీకేల్లో అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు తాను అధికారంలో ఉండగా వ్యవసాయం దండగా అంటూ రైతులను అవమానించారని గుర్తు చేశారు. అయితే జగనన్న ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగగా మార్చేసిందని స్పష్టం చేశారు. నేడు ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలను సైతం సబ్సిడీతో ఇంటి ముంగిటే అందిస్తున్నామని వివరించారు. ఈ-క్రాప్ బుకింగ్‌తో పంట నష్ట పరిహారం అందిస్తూ ప్రభుత్వం తోడుగా నిలుస్తోందన్నారు. రైతు సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌రాజు, ఏఓ కోదండయ్య, హార్టికల్చర్ ఆఫీసర్ వెంకటసౌజన్య, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పీఆర్ ఏఈ వీరయ్య, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, సర్పంచ్ మల్లిక, పార్టీ మండల కన్వీనర్ గోవిందస్వామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుమార్‌స్వామి, సుదర్శనం, లక్ష్మణమూర్తి, రాజయ్య, హేమాద్రి, దాసు, రాజా, వెంకటేష్, ఏసు, షణ్ముగం, మురళీ యాదవ్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి రోజా పిలుపునిచ్చారు. సోమవారం పుత్తూరు పట్టణంలోని నందిమంగళం సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.8.50 లక్షలతో చేపట్టిన తాగునీటి బోరు, పైపులైను పనులకు భూమి పూజ చేశారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికి సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష అని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ మోసపూరిత హామీలను గుప్పిస్తోందని ఆరోపించారు. ఇందుకు పచ్చమీడియా వంత పాడుతోందని మండిపడ్డారు. నగరి నుంచి తనను ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా స్థానికంగా నిద్రించారు. భూమి పూజలో మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎల్‌ఓ దిలిప్, కౌన్సిలర్లు బాలసుబ్రమణ్యం, బాలాజీ, జాన్‌కెనడీ, ఏకాంబరం, వైఎస్సార్‌సీపీ నాయకులు శివ, వెంకటేష్, రత్నం, ప్రభు, లారీమోహన్, కార్తికేయన్ పాల్గొన్నారు.

పాదిరేడులో 'పల్లె నిద్ర'

వడమాలపేట మండలం పాదిరేడు గ్రామంలో మంత్రి ఆర్‌కే రోజా ఆదివారం రాత్రి పల్లె నిద్ర నిర్వహించారు. ఉదయాన్నే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. పలువురు గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చిన వ్యక్తిగత సమస్యలను సావధానంగా విని పరిష్కారానికి సూచనలందించారు. మంత్రి మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలా ప్రతి ఇంటి వద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందాయా? మీ అవసరాలు ఏమిటి అని అడిగిన దాఖలాలు లేవన్నారు. అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా పథకాలు ఇంటి గుమ్మం వద్దకే వస్తున్నాయని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల ప్రత్యేక నిధులు అందుతున్నాయని తెలిపారు. ఎన్నికల హామీలను జగనన్న 99 శాతం నెరవేర్చినట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఇందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కరుణాకర్ చౌదరి, శేఖర్, సురేష్‌రాజు, నందయ్య, ఉమాపతి, సుదర్శన్, మురళి, మునిబాబు, వెంకటేష్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



పాదిరేడులో పర్యటిస్తున్న మంత్రి రోజా

కులగణనతో సామాజిక న్యాయం



డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణనతో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో బడుగుల ఆత్మ గౌరవం పెరిగిందన్నారు. ఇప్పుడు కుల గణన నిర్ణయాన్ని మరో వందేళ్లపాటు చెప్పుకుంటారని వెల్లడించారు. నాలుగేళ్లకు కూడా కులగణన పూర్తి కాదని కొందరు అంటున్నారని, అసాధ్యాల సుసాధ్యం చేయడం జగనన్నకే సాధ్యమని తెలిపారు. రాష్ట్రంలో రెండు రోజుల్లోనే ఫీవర్ సర్వే పూర్తి చేయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఏడు రోజుల్లోనే కులగణన సర్వే పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఆ మేరు రిజర్వేషన్లు అమలు చేసే వెసులుబాటు వస్తుందని చెప్పారు. కేబినెట్‌లో 25 మంది మంత్రులు ఉంటే 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందినవారు ఉండడం గొప్ప విషయమని వివరించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



మాట్లాడుతున్న మేయర్ అముద

చిత్తూరు కార్పొరేషన్: పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానం పెంపొందించుకోవచ్చని మేయర్ అముద, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ మధుబాల తెలిపారు. సోమవారం జిల్లా గ్రంథాలయంలో వారోత్సవాల ముంగిపు కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ లైబ్రరీకి రావడం దినచర్యగా మార్చుకోవాలని సూచించారు. చిన్నతనం నుంచి పుస్తకాలు చదివితే విలువతో కూడిన జీవన విధానం తెలుస్తుందన్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ జ్ఞాన సముపార్జనపై దృష్టి సారించాలని కోరారు. పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమై విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చదువుకుంటూ, ప్రశాంతంగా జీవనం సాగిస్తే ఏ రంగంలో అయినా రాణించవచ్చని తెలిపారు. పీసీఆర్ ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్ మాట్లాడుతూ చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఒక కొత్త పుస్తకం కొనుక్కో అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ, లైబ్రేరియన్లు లలిత, మధుబాబు, రాజ్‌కుమార్, గుణశేఖర్, పూర్ణిమ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎన్నికల కసరత్తును పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సీఈఓ హరేంద్రప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన రాష్ట్ర కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అడిషనల్ సీఈఓ మాట్లాడుతూ నోడల్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారుల నియామకం వెంటనే చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని చెప్పారు. పోస్టల్‌బ్యాలెట్ కౌంటింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం పకడ్బందీగా కసరత్తు చేపడుతున్నట్లు వివరించారు. కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ బ్యూలా, సిబ్బంది ఉమాపతి, మనోజ్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్

నేడు ఎన్నికల ప్రక్రియపై వర్క్‌షాప్

ఎన్నికల ప్రక్రియపై మంగళవారం చిత్తూరులో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు సోమవారం క్షేత్రస్థాయి అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బీసీ భవన్‌లో ఉదయం 9గంటలకు వర్క్‌షాప్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి 'ప్రైమ్ 2.0' ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మంగళవారం నుంచి ప్రైమ్ 2.0 విధానం ప్రవేశపెడుతున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నూతన విధానంపై వినియోగదారులకు అవగాహన వచ్చే వరకు పాత విధానం కూడా అమల్లో ఉంటుందన్నారు. నూతన పద్ధతిలో వినియోగదారులు చెక్‌స్లిప్ బయట చేసుకుని, క్రయ, విక్రయ, సాక్షుల డిజిటల్ సంతకాలు చేయాల్సి ఉంటుందని వెల్లడించారు. అలాగే సబ్‌రిజిస్ట్రార్ ఆన్‌లైన్‌లో డిజిటల్ సంతకం చేస్తారన్నారు. దీనిపై వినియోగదారులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. 1998 నుంచి ఇప్పటి వరకు కార్డ్ విధానంలో రిజిస్ట్రేషన్ జరిగిందని దానికి అప్‌డేట్‌గా ప్రైమ్ 2.0 వచ్చిందన్నారు. ఆధునిక సాంకేతికను రైటర్లు అందిపుచ్చుకోవాలని కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


సుధాకర్ (ఫైల్)

పూతలపట్టు: మండలంలోని ఎగువపాలకూరు ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుధాకర్ (51) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాళానికి చెందిన సుధాకర్ బైక్‌పై పాఠశాలకు వస్తుండగా తాటితోపు వద్ద ముందు వెళుతున్న ఆటో ఒక్కసారిగా ఆగడంతో వెనుక నుంచి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఎస్‌ఐ రాంభూపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

– రూ.9లక్షల సొత్తు అపహరణ

చిత్తూరు అర్బన్: నగరంలో గంగాసాగరంలో వెంకటేష్ అనే వ్యాపారి ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.9లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరించినట్లు బాధితుడు తెలిపాడు. సమీప బంధువు మరణించడంతో రెండు రోజుల క్రితం ఊరు వెళ్లామని, దుండగులు ఇంటి తాళం పగుల గొట్టి 320 గ్రాముల బంగారు, 310 గ్రాముల వెండి నగలు చోరీ చేశారని వాపోయాడు. సోమవారం ఈ మేరకు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగు'బడి'

శిథిలావస్థకు చేరిన భవనాలు.. పెచ్చులూడిన తరగతి గదులు.. నెర్రెలు బారిన గోడలు.. పనిచేయని లైట్లు.. తలుపులు లేని మరుగుదొడ్లు.. పరిసరాల్లో పెరిగిన ముళ్లకంపలు.. స్వైరవిహారం చేసే పందులు.. నీళ్లు రాని కొళాయిలు.. ఇదీ గతంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి. అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు పథకంతో సర్కారు బడుల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అత్యాధునిక మౌలిక వసతులతో అలరారుతున్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు చదువుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. పిల్లలు సంతోషంగా విద్యాభ్యాసం చేస్తుంటే తల్లిదండ్రులు.. ఉపాధ్యాయుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మహోన్నత ఆశయంతో ప్రారంభించిన నాడు–నేడు పథకంపై జనవాక్కు.

– చిత్తూరు కలెక్టరేట్




నాడు–నేడు పథకం కింద ప్రభుత్వం అభివృద్ధి చేసిన పాఠశాల

కార్పొరేట్ స్థాయిలో ఉంది



గతంలో మా ఊరిలోని ప్రభుత్వ బడి పాడుబడిన భవనంలా ఉండేది. అందుబాటులో ఉంది కాబట్టి మా ఇద్దరు పిల్లలను అక్కడికే పంపేవాళ్లం. పెచ్చులూడిపోతూ అధ్వానంగా ఉండే భవనంలో ఎప్పుడు ఏం జరుగుందో అని భయపడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన నాడు–నేడు పథకంతో పాఠశాలను రూపురేఖలే మార్చేశారు. కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. ఇప్పుడు మా పిల్లలను నిశ్చింతగా పాఠశాలకు పంపుతున్నాం. మా వాళ్లకు జగనన్న విద్యాకానుక కింద పుస్తకాలు తదితర సామగ్రి అందించారు. పౌష్టికాహారం పెడుతున్నారు.

– ఎం.రామూర్తి, ముడిపల్లె, దళితవాడ, నగరి మండలం

నేను సైతం అనుకున్నా..



నేను పలమనేరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్నా. గతంలో ఇదే మండలం నూనేవారిపల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా విధులు నిర్వర్తించా. తొలి విడత నాడు–నేడులో ఆ బడిని మంచిగా అభివృద్ధి చేశారు. అదే స్ఫూర్తితో నేను సైతం ఏదో ఒకటి చేయాలనుకున్నా. అందుకే సొంత నిధులు వెచ్చించి ఆ పాఠశాల ప్రహరీ గోడ నిర్మించా. ప్రభుత్వం చేపట్టిన మంచి పనుల్లో భాగస్వామిని కావడం ఆనందంగా ఉంది. గ్రామస్తులు సైతం బడి మాది అన్న భావనతో పిల్లలను పంపుతున్నారు.

– పుష్పలత, ఉపాధ్యాయిని, బాలికోన్నత పాఠశాల, పలమనేరు

అద్భుతమైన పథకం



గతంలో ఏదో ఒక ప్రైవేట్ స్కూలుకి మా బిడ్డను పంపేవాళ్లం. ప్రభుత్వం తీసుకువచ్చిన నాడు–నేడు పథకంలో భాగంగా మా ఊరిలోని బడిని ఉన్నతంగా అభివృద్ధి చేశారు. పిల్లలకు చక్కగా చదువుకునే మంచి సౌకర్యాలు కల్పించారు. అందుకే నా కుమారుడు వ్యాస భగవాన్‌ను సర్కారు బడిలో చేర్పించా. పాఠశాలతో మాకు సైతం బాధ్యత అప్పగించారు. బడిలో ఏం జరుగుతోందో.. పాఠాలు ఎలా చెబుతున్నారో కూడా మాకు తెలుస్తోంది. ఏదిఏమైనా నాడు–నేడు అద్భుతమైన పథకం.

– నందీశ్వర్, విద్యార్థి తండ్రి, కొలమాసనపల్లె

రూపురేఖలు మారాయి



నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. మా పాఠశాలను రూ.4.82 లక్షలు వెచ్చించి ఆధునికీకరించారు. టాయిలెట్లు నిర్మించారు. మూడు తరగతి గదుల సీలింగ్ దెబ్బతినడంతో మరమ్మతులు చేశారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. చక్కగా టైల్స్ వేశారు. బడి చూడ ముచ్చటగా తయారైంది. విద్యార్థులు ఎలాంటి సమస్య లేకుండా చదువుకుంటున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఇక్కడ చేర్పించేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు.

– సుబ్రమణ్యం, ఉపాధ్యాయుడు, ప్రాథమిక పాఠశాల, నింద్ర

పది పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో విద్యార్థుల నామినల్ రోల్స్, ఇతర డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని పేర్కొంది.

పక్కాగా ప్రణాళిక బడ్జెట్ ప్రతిపాదనలు

చిత్తూరు కలెక్టరేట్ : సమగ్రశిక్ష వార్షిక ప్రణాళిక బడ్జెట్ ప్రతిపాదనలను పక్కాగా సిద్ధం చేయాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. సోమవారం చిత్తూరు బాలాజీనగర్ కాలనీ లోని మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, సీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ పాఠశాలల వారీగా వార్షిక అభివృద్ధి ప్రణాళికలను నిర్దేశిత గడువులోపు తయారు చేయాలని సూచించారు. సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఉత్తమ విద్య అందేలా ప్రణాళికలు రూపొందించి ఈ నెల 30వ తేదీలోపు జిల్లా కార్యాలయానికి చేర్చాలని ఆదేశించారు. సమావేశంలో డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు సెల్వరాజ్, అరుణాచల రెడ్డి, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ జయప్రకాష్ సెక్టోరల్ అధికారులు అజయ్‌కుమార్‌రెడ్డి, ఉదయలక్ష్మి, పల్లవి పాల్గొన్నారు.

పలమనేరు న్యాయమూర్తికి ఉద్యోగోన్నతి

చిత్తూరు అర్బన్: పలమనేరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.రవికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ సివిల్ న్యాయమూర్తిగా ఆయనను పీలేరు కోర్టుకు బదిలీ చేస్తున్నట్లు పేర్కొంది.

భరత్ ఆధ్వర్యంలోనే కుప్పం అభివృద్ధి


మహిళలకు పసుపు కుంకుమ పంపిణీ చేస్తున్న దుర్గాపద్మణి

కుప్పంరూరల్ : నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలోనే కుప్పం అభివృద్ధి చెందిందని ఆయన సతీమణి దుర్గా పద్మణి తెలిపారు. సోమవారం మండలంలోని బిక్కిలిగట్టు, మోట్లచేను, నారాయణమానుకొటాలు, చిన్న ఒబ్బ గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు పసుపు, కుంకుమ, చీర, గాజులు పంపిణీ చేశారు. దుర్గా పద్మణి మాట్లాడుతూ భరత్‌ను గెలిపిస్తే జగనన్న కేబినెట్‌లో మంత్రి అవుతారని, ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని వెల్లడించారు. కుప్పంలో 40 ఏళ్లుగా గెలిచినవారు ప్రజలకు చేసింది శూన్యమని, భరత్ నాలుగేళ్లలో పలు అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. ప్రజలు పెద్ద మనసుతో ఆలోచించుకుని భరత్‌ను ఆశీర్వదిస్తే కుప్పం నియోజక వర్గంలో సమస్యలే లేకుండా చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, స్థానిక నేతలు తిమ్మరాయన్, మల్లప్ప పాల్గొన్నారు.

డెంగీ.. మలేరియాపై అప్రమత్తం


మాట్లాడుతున్న శ్రీనివాసులు

గుడిపాల : డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తంగా చేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం గుడిపాల పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ప్రతి పల్లెకు వెళ్లి సీజనల్ జ్వరాలపై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలని స్పష్టం చేశారు. అనంతరం తుమ్మిందపాళ్యం గ్రామంలో పర్యటించి దోమల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్థానికులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రామకృష్ణ, సంధ్య, సిబ్బంది నరసింహమూర్తి, చంద్రశేఖర్, విజయ, వెంకటేష్, నారాయణ, మనోహర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి కేరాఫ్ పెనుమూరు


సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న అధికారులు, తమిళనాడు రైతులు

పెనుమూరు(కార్వేటినగరం)/ చిత్తూరు అగ్రికల్చర్ : ప్రకృతి వ్యవసాయానికి పెనుమూరు మండలం కేరాఫ్‌గా నిలుస్తోందని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ వాసు తెలిపారు. సోమవారం మండలంలోని శార్వగానిపల్లెలో రామానాయుడు,మణెమ్మ అనే రైతులు నిర్వహిస్తున్న ఏటీఎం, ఏ గ్రేడ్, వేసవి పంట, చేపల చెరువు, బహుళ పంటల నమూనాలను తమిళనాడుకు చెందిన రైతులు, అధికారులతో కలిసి సందర్శించారు. అలాగే మనియానంపల్లెకు చెందిన రైతు సుధాకర్‌నాయుడు నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం ఉపకరణాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వాసు మాట్లాడుతూ సేంద్రియ సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. ఈ పంట ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వెల్లడించారు. పంటకు చీడపీడలు, తెగుళ్ల బెడద ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తమిళనాడు ప్రకృతి వ్యవసాయ సీనియర్ కన్సల్టెంట్ ఆర్.తిలకవతి, జిల్లా ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది నాంచారమ్మ, హరికృష్ణ, లక్ష్మి, సుధాకర్‌నాయుడు, ధనలక్ష్మి, హరికృష్ణారెడ్డి, హేమలత, భాస్కర్, జయంతి పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడికి జైలు


రామునిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

పలమనేరు : బైక్‌ల చోరీ కేసులో పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన నిందితుడు దాసరి రాము(20)కి పలమనేరు కోర్టు 8 నెలల జైలుశిక్ష విధించినట్లు సీఐ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. పలమనేరులోని గాంధీనగర్, ఐరాల, పుంగనూరుల్లో నిందితుడు మూడు బైక్‌లు చోరీ చేయగా, ఈ ఏడాది మార్చి 22వ తేదీన పోలీసులు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. కేసు విచారించిన న్యాయమూర్తి రవి ఈ మేరకు నిందితుడికి జైలుశిక్షను విధించినట్లు వివరించారు. ఏపీపీ స్వాతి వాదనలు వినిపించినట్లు చెప్పారు. నిందితుడిని చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఆదర్శవంతంగా బోయకొండ అభివృద్ధి

– రూ.23.26 కోట్ల పనులకు ఆమోదం


మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, పక్కన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

చౌడేపల్లె : బోయకొండను ఆదర్శవంతంగా అభివృద్ధి చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి వెల్లడించారు. సోమవారం బోయకొండ గంగమ్మ ఆలయ పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.23.26 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సహకారంతో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రంగా బోయకొండను తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. రూ.3 కోట్ల సీజీఎఫ్ నిధులతో రణభేరి గంగమ్మ ఆలయాన్ని నూతనంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. గంగాపురంలో భక్తులకు సౌకర్యార్థం రూ.7.50 కోట్లతో వసతి గృహాలు, రూ.10 కోట్లతో 74 రూములు నిర్మించనున్నట్లు వివరించారు. అలాగే రూ.1.75 కోట్లతో గెస్ట్‌హౌస్ నిర్మాణం, మెట్ల మార్గంలో రూ.65 లక్షల వ్యయంతో టాప్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గోశాల వద్ద రూ.36 లక్షలతో సిమెంటురోడ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపినట్లు చెప్పారు. త్వరలోనే ఈ పనులను ప్రారంభించి సకాలంలో పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఈఓ చంద్రమౌళి, పాలక మండలి సభ్యులు రాజేష్, భాస్కర్‌రెడ్డి, దేవదాయశాఖ ఎస్‌ఈ సతీష్, డీఈఈ గంగయ్య, ఏఈ ఆనంద్ పాల్గొన్నారు.

చోరీకి పాల్పడింది తమిళనాడు వ్యక్తులు!

చిత్తూరు అర్బన్: నగరంలోని కీర్తన గోల్డ్ లోన్స్ కంపెనీలో ఈ నెల 3వ తేదీన చోరీకి పాల్పడి 880 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించింది తమిళనాడుకు చెందిన వ్యక్తులే అని పోలీసులు గుర్తించారు. దర్యాప్తు చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు ఈ మేరకు తమిళనాడులోని మధురైకు వెళ్లినట్లు సమాచారం.

యువకుడి అదృశ్యం

చిత్తూరు అర్బన్: నగరంలో రాకేష్ (27) అనే యువకుడు కనిపించడంలేదంటూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గిరింపేటకు చెందిన యువకుడు దుర్గమ్మ ఆలయ సమీపంలో టీ దుకాణం నడుపుతున్నాడు. ఈనెల 17వ తేదీ నుంచి రాకేష్ కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.



కనువిందుగా 'కొండ'

గుడుపల్లె మండలం బూరుగుమాకులపల్లెలోని మల్లప్ప కొండ కనువిందు చేస్తోంది. పచ్చటి చెట్లతో ఆకట్టుకుంటోంది. ఆలయానికి వెళ్లేందుకు నూతన రహదారి నిర్మించడంతో భక్తుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. ఘాట్‌లోని ఆహ్లాదకర వాతావరణం పర్యాటల హృదయాలకు హత్తుకుంటోంది. కార్తీక సోమవారం నాడు సందర్శకులు షేర్ చేసిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం విశేషం. – కుప్పం